క్లుప్తంగా

వాలీబాల్ విజేత రామకృష్ణాపురం



విజేతలకు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ బాబూరావు

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ పంచాయతీ పురుషోత్తుక్ర గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో రామకృష్ణాపురం జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్ పోటీలో సారవకోటపై రామకృష్ణాపురం జట్టు విజయం సాధించింది. సర్పంచ్ కొండాల బాబూరావు, ఉప సర్పంచ్ చింతపల్లి భాస్కరరావు బహుమతులు అందజేశారు.

బోర్లు బాగు చేయాలని వినతి



మరమ్మతులకు గురైన బోరు

సారవకోట: మండలంలోని అన్నుపురం గ్రామంలో రెండు తాగునీటి బోర్లు పాడైపోయాయని, వాటిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు సమీపంలో ఉన్న రెండు బోర్లు నెల రోజుల క్రితం పాడైపోయాయని స్థానికులు తెలిపారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రికెట్, వాలీబాల్ కిట్లు వితరణ



కిట్లు అందజేస్తున్న సీతన్న

నరసన్నపేట: మండలంలోని బాలసీమలో యువకుల కోరిక మేరకు క్రికెట్, వాలీబాల్ కిట్లును గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు, మన్యం జిల్లా వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షులు మల్ల సీతన్న వితరణ చేశారు. మంగళవారం యువతకు ఈ కిట్లును అందించారు. యువకులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పేద కుటుంబాలకు చెందిన ముగ్గురు మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు.

దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక బంగారం వర్తకుడు సీహెచ్ షణ్ముఖరావు ఆధ్వర్యంలో 60 మంది పేదలకు నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. తన సోదరుడు వీరాచారి జ్ఞాపకార్థం దుస్తులు అందజేసినట్లు షణ్ముఖరావు తెలిపారు. శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, నరసన్నపేట కోర్టు ఏజీపీ గొండు సత్యనారాయణ, మార్పు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణం



కొత్తూరు కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

కొత్తూరు: సంక్రాంతికి వచ్చిన వలస వాసులు స్వగ్రామాల నుంచి పలువురు తిరుగు ప్రయాణమయ్యారు. కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్ మంగళవారం ప్రయాణీకులతో నిండింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తిరుగుముఖం పట్టడంతో ఆర్టీసీ, ప్రైవేట్, ఆటోలు, ఇతర వాహనాలు ప్రయాణీకులతో కిటకిటలాడాయి.

బాలిక వైద్యానికి సాయం



నగదు అందజేస్తున్న గ్రామస్తులు

పొందూరు: మండలంలోని బొడ్డేపల్లి గ్రామానికి చెందిన గురుగుబెల్లి లాస్య ఆరు నెలలుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంగళవారం రూ. 54 వేల నగదును బాలిక నాన్నమ్మకు అందజేశారు. దాతలు మరింత మంది స్పందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నరసన్నపేట: హాలాహలేశ్వరిని యాత్రకు తరలివచ్చిన జనసందోహం



నరసన్నపేట: చెన్నాపురం యాత్రలో పాల్గొన్న భక్తులు



జలుమూరు: రాణాలో పూజలందుకుంటున్న ముఖలింగేశ్వరుడు

జన జాతర

- హాలాహలేశ్వరుడికి, ముఖలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు
- పలు గ్రామాల్లో యాత్రలు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

నరసన్నపేట: మండలంలోని రెడ్డికిపేట–అంప్లాం గ్రామాల మధ్య ఉన్న మల్లికార్జునస్వామి ఆలయ (శివాలయం) ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన యాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జాతీయ రహదారి నుంచి గొట్టిపల్లి, రెడ్డికిపేట మీదుగా బసివలస రోడ్డు భక్తులతో నిండింది. ముక్కనుమ రోజున ఏటా హాలాహలేశ్వరిని పేరున యాత్ర వందేళ్లకు పైగా ఈ శివాలయం వద్ద నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఈ ఏడాది కూడా యాత్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు ఎంటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని గొట్టిపల్లి, దూకులపాడు సర్పంచ్ అవ్వ రవీంద్రరెడ్డి, అల్లు అసిరినాయుడు, కమిటీ ప్రతినిధులు శిమ్మ లక్ష్మణరావు, కోరెడ్డి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కంబకాయలో..

కంబకాయలో కూడా స్వయంబేశ్వర ఆలయం 73వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ కూడలిలో యాత్ర నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. యాత్రల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నరసన్నపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. యాత్ర ప్రశాంతంగా జరిగిందని సర్పంచ్ పాగోటి కుసుమ కుమారి తెలిపారు. అలాగే మండల పరిధిలోని చెన్నాపురం వద్ద కూడా యాత్ర నిర్వహించారు.

ఘనంగా ముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: ముక్కనమ సందర్భంగా రాణలో వెలిసిన ముఖలింగేశ్వరుడి తిరువీధి ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామానికి పశ్చిమవైపు ఉన్న ఆలయం నుంచి పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను జాతర స్థలం వద్దకు మధ్యాహ్నం మూడు గంటలకు తెచ్చారు. నంది వాహనంపై పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను చక్కగా అలంకరించి తిరువీధి ప్రారంభించారు. స్వామివారికి తర్ర కుటుంబీకులు, భక్తులు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, చుటు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా ఉమాకామేశ్వరస్వామి రథయాత్ర

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలోని ఉమాకామేశ్వర స్వామివారి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సమూర్తులను రథంపై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం ఆవరణలో జాతర నిర్వహించారు.



జలుమూరు: రాణా జాతరకు విచ్చేసిన భక్తులు



సరుబుజ్జిలి: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస రూరల్: సంగమయ్య జాతరలో భక్తులు

సంగమయ్య జాతర..

ఆమదాలవలస రూరల్: మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద ముక్కనుమ రోజు మంగళవారం జాతర నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ప్రతీ ఏడాది సంక్రాంతి పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించే ఈ జాతర ముక్కనుమ రోజుతో ముగియడంతో జిల్లా, ఇతర ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. కొండపై ఉన్న సంగమయ్యకు పూజలు నిర్వహించారు. కొండ దిగువ ప్రాంతంలో జాతర ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లో చిన్నారులు సందడి చేశారు. ఈ జాతరలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఎస్ఐ వై.కృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

దంతపురిక్షేత్రంలో..

సరుబుజ్జిలి: చినపాలెం సమీపంలోని దంతపురిక్షేత్రంలో గల సోమాలమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పెద్దపాలెం సర్పంచ్ సర్థరి గురవులు నాయుడు, పార్టీ నాయకులు కిల్లి రామ్మోహనరావు, కిల్లి వెంకటేష్ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మెండ సూర్యారావు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు జమ

కొత్తూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు వారి ఖాతాల్లోకి ప్రభుత్వం నేరుగా జమ చేసిందని ఏఓ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 16 తేదీన రైతుల ఖాతాల్లోకి రెండో విడత ధాన్యం డబ్బులు జమ అయ్యాయన్నారు. మండలంలో ఇంతవరకు 15,887 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 3,380 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇంత వరకు 80 శాతం మంది రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. మిగిలిన రైతులకు కొద్ది రోజుల్లోనే డబ్బులు జమ అవుతాయన్నారు. మండలంలో కొత్తూరు, ఓంద్రుజోల, కర్లెమ్మతోపాటు పలు రైతు భరోసా కేంద్రాలకు ఇచ్చిన ధాన్యం లక్ష్యాలను పూర్తి అయినట్లు చెప్పారు. ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలో ధాన్యం మిగిలి ఉన్నట్లు అయితే ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే రైతులకు షెడ్యూల్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉన్నట్లు అంచనా వేశామన్నారు. రైతులు ఆందోళన చెందొవద్దన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు.

ప్రజలకు అందుబాటులో సచివాలయ సేవలు



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఆమదాలవలస రూరల్: సచివాలయాల ద్వారా ప్రజలకు నిరంతరం సేవలు అందజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. మండలంలో శ్రీనివాసాచార్యులపేటలో గల గ్రామ సచివాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలు వస్తే వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలన్నారు. ఎంపీడీఓ ఎం.రేణుక, ఏఓ మెట్ట మోహనరావు, ఏపీఎం కూర్మారావు, డీటీ బి.సునీల్, పంచాయతీ కార్యదర్శి బి.నాగరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రూ.1.50 లక్షల విరాళం అందజేత



చెక్కు అందజేస్తున్న సినీ నిర్మాత భానుప్రసాద్

కొత్తూరు: మండలంలోని జోగిపాడులో నిర్మాణం చేపడుతున్న అయ్యప్ప సన్నిధానానికి నందిగాం మండలం పెద్దతామరపల్లికి చెందిన వేంకటేశ్వర యునప్రా డవలపర్స్ ఎండీ, సినీ నిర్మాత బసవల భానుప్రసాద్ మంగళవారం రూ.1.50 లక్షలను విరాళంగా అందజేశారు. యునప్రా డవలపర్స్‌లో జోగిపాడుకు చెందిన ఆర్.భాస్కరరావు పని చేస్తున్నందున నిర్మాత భానుప్రసాద్‌ను సంక్రాంతికి గ్రామానికి ఆహ్వానించారు. గ్రామస్తుల కోరిక మేరకు భానుప్రసాద్ తనవంతు సహకారం అందజేశారు. ఈ సందర్భంగా భానుప్రసాద్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఇటువంటి దైవ కార్యక్రమాలకు విరాళం అందజేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని భానుప్రసాద్ తెలిపారు. సన్నిధానం నిర్మాణ కమిటీ ప్రతినిధులు, గ్రామానికి చెందిన విశ్రాంత చీఫ్ ఇంజినీర్ సోమయాజుల నరసింహమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

• సినీ నటుడు గిరీష్ సందడి



నటుడు గిరీష్‌ను కలుసుకున్న యాత్రికులు

సరుబుజ్జిలి: పలు చలన చిత్రాలతోపాటు, బుల్లితెర సీరియల్స్‌లో నటించిన కింతలి గిరీష్ తన స్వంత గ్రామం పురుషోత్తపురంలో సందడి చేశారు. గ్రామంలో జరుగుతున్న జాతరకు ఆయన విచ్చేశారు. మహిళలు, యువత ఆయనతో సెల్ఫీల కోసం పోటీపడ్డారు. ఎక్కడ ఉన్నా ప్రతిఏటా సంక్రాంతికి స్వంత ఊరు తప్పకకుండా వస్తానని, గ్రామాభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. రెగ్యుల్ సీరియల్స్‌తోపాటు, ఇటీవల విడుదలైన ధమాకా, హిట్–2 చిత్రాల్లో మంచి పాత్రలు చేసానన్నారు. అనంతరం ఉమాకామేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

గాంధీ విగ్రహం ఆవిష్కరణ



గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

పొందూరు: మండలంలోని లోలుగు గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని జెడ్పీటీసీ లోలుగు కాంతారావు మంగళవారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహదాతలు ఎంపీటీసీ లోలుగు లక్ష్మన్నాయుడు, లోలుగు మనోహర్, సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి, వైస్ సర్పంచ్ చంద్రరావు, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని దొంకలబడవంజ గ్రామంలో ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సరీ్వస్ సొసైటీ (టెస్) సంస్థ నిర్వహిస్తున్న ప్రజా గ్రంథాలయానికి విజయవాడలో ఏపీ జెన్‌కోలో ఏఈగా పనిచేస్తున్న సరుబుజ్జిలి మండలం పాతపాడు గ్రామానికి చెందిన వండాన అప్పలరాజు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను మంగళవారం అందజేశారు. పలు రకాల కథలు, పటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాల పాటు ఇంజినీరింగ్, గేట్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ప్రజా గ్రంథాలయం నిర్వాహకులు వెంకటరావుకు అందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

రథసప్తమి ఏర్పాట్లపై సమావేశం నేడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 27 అర్ధరాత్రి నుంచి 28 రాత్రి వరకు జరగనున్న రథసప్తమి ఉత్సవ నిర్వహణపై బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి అనివెట్టి మండపంలో పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుందని ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజులుగా ఏర్పాట్లు జరుగుతున్న క్రమంలో భక్తులకు సౌకర్యవంతంగా దర్శనాలకు తగిన చర్యలపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ తదితర శాఖాధికారులతో సమన్వయం చేసేలా సమావేశం జరగనుందని పేర్కొన్నారు.

• సంతోషాల వేడుక..



అల్లు వీధిలో పొంగలని వండుతున్న మహిళలు

కొత్తూరు: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో పలు రకాల కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు సంప్రదాయాన్ని తలపించేలా మట్టి కండలో సంక్రాంతి పొంగలని తయారు చేశారు. అనంతరం గొబ్బెమ్మలతో మహిళలు పూజలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు సినీ పాటలకు డాన్స్‌లు చేశారు. కుర్చీ ఆట ఆడారు.

• అపూర్వ కలయిక



ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో మంగళవారం ఆత్మీయ సమేళనం నిర్వహించారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు చేరుకున్నారు. 22 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దారపు ప్రసాదరావు, ఎం.వెంకటరమణ, ఎం.తాతయ్య, బుగత అనిల్ కుమార్, బంద గురువులు, తులుగు షణ్ముఖరావు, ప్రసాదరావు, అప్పారావు, మల్లేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.

• మంచు దుప్పటి



ఆమదాలవలస రూరల్: అపరాల పంటపై దట్టంగా కురుస్తున్న పొగమంచు

ఆమదాలవలస రూరల్/బూర్జ: ఆమదాలవలస, బూర్జ మండలాల్లో మంగళవారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కురవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. గత మూడు రోజుల నుంచి ఉదయం మంచు కురవడం వల్ల వాటి ప్రభావం అపరాల పంటపై పడుతూ పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. మంచు ప్రభావం వల్ల అపరాల పంట పూత పూర్తిగా రాలి పోయి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



బూర్జ: రహదారిపై పడుతున్న మంచు